సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం, 23, సెప్టెంబర్, 2022



మారేడుమిల్లిలో మెగాస్టార్

మారేడుమిల్లి : పర్యాటక ప్రాంతమైన మారేడుమిల్లికి మెగాస్టార్ చిరంజీవి వచ్చారు. మైత్రీ మూవీ బ్యానర్స్‌పై చిరంజీవి హీరోగా, ప్రత్యేక పాత్రలో హీరో రవితేజ ప్రధాన తారాగణంగా బాబీ దర్శకత్వంలో రూపొందిస్తున్న సినిమా షూటింగ్ కోసం ఆయన బుధవారం రాత్రి ఇక్కడికి వచ్చారు. స్థానిక వుడ్స్ రిసార్ట్‌లో బస చేశారు. శనివారం నుంచి ఆయన అటవీ ప్రాంతంలో జరుగనున్న షూటింగ్‌లో పాల్గొనున్నారు. చిరంజీవి మారేడుమిల్లికి రావడం ఇది రెండో సారి. గతంలో ఆచార్య సినిమా షూటింగ్ కోసం తనయుడు హీరో రామ్‌చరణ్‌తో కలిసి వచ్చారు. మెగాస్టార్ రాకతో మారేడుమిల్లి ప్రాంతం అభిమానులతో సందడిగా మారింది.

ఆహారం.. ఆరోగ్యం



- గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న బాలింతలు, గర్భిణులు

IIలో

ఆ..పరేషాన్ తొలగింది

శస్త్ర చికిత్స అంటేనే గిరిజనులు హడలిపోయే పరిస్థితి.. ఆపరేషన్ పేరెత్తితేనే సాధారణంగా ఉండే భయంతో పాటు దూరాభారమైన విశాఖపట్నంలో కేజీహెచ్‌కు వెళ్లి అవస్థలకు గురికావాలనే చింత.. రవాణా, వసతి వ్యయం భరించలేక చాలా మంది చికిత్స చేయించుకోని దుస్థితి..ఇప్పుడా పరిస్థితులు మారాయి. పాడేరు జిల్లా ఆస్పత్రిలోనే శస్త్ర చికిత్సలు చేస్తుండడంతో ఏజెన్సీ వాసుల కష్టాలు తొలగాయి. సుమారు వెయ్యి ఆపరేషన్లను ఇక్కడి వైద్యాధికారులు విజయవంతంగా పూర్తి చేశారు.

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్ర చికిత్సలు
- గతంలో కేజీహెచ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి
- గిరిజనులకు తగ్గిన దూరాభారం



జిల్లా ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న వైద్యుల బృందం(ఫైల్)

ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల వరకు పాడేరు జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన ఆపరేషన్ల వివరాలు

జనరల్ సర్జరీలు	గైనకాలజీ సర్జరీలు
మేజర్ -100	మేజర్ - 86
మైనర్ -306	మైనర్ - 176

ఆర్థోపెడిక్	వైఎస్సార్ కంటి ఆపరేషన్లు- సుమారు 150
మేజర్ - 158	
మైనర్ -12	

పాడేరు రూరల్: స్థానిక ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల గిరిజనులకు పాడేరు జిల్లా ఆస్పత్రే దిక్కు. ఏ అనారోగ్యం వచ్చినా స్థానిక సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికే వస్తుంటారు. గత ప్రభుత్వం హయాంలో గిరిజనులకు వైద్య సేవలు పూర్తిగా అందుబాటులో ఉండేవి కావు. రోడ్డు ప్రమాదాలు, చిన్న,చిన్న ఆపరేషన్లు, సిజేరియన్లు తదితర వాటికి కూడా విశాఖపట్నం కేజీహెచ్, ఇతర మైదాన ప్రాంత ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో గిరిజనులు వ్యయ,ప్రయాసలకు గురికావలసి వచ్చేది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది. దీంతో ఇప్పుడు స్థానిక జిల్లా ఆస్పత్రిలోనే శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ఆపరేషన్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు వివిధ సమస్యలకు సంబంధించి సుమారు 838, వైఎస్సార్ కంటి చికిత్స కేంద్రంలో సుమారు 150 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు పూర్తి చేశారు. గతంలో గర్భిణుల సిజేరియన్, రోడ్డు ప్రమాద బాధితులకు ఏదైనా చిన్నపాటి ఆపరేషన్, ఇతర శస్త్ర చికిత్సల కోసం విశాఖపట్నం కేజీహెచ్, మైదాన ప్రాంతాల్లోని ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పాడేరులో ఆపరేషన్లు చేస్తుండంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి సుమారు వెయ్యి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఇటీవలే పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆస్పత్రిని సందర్శించి, కేక్ కట్ చేసి, స్థానిక ఆస్పత్రి వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.



పాడేరు జిల్లా ఆస్పత్రి



శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంతో కేక్ కట్ చేస్తున్న ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ(ఫైల్)

స్థానికంగానే శస్త్ర చికిత్సలు



పాడేరు జిల్లా ఆస్పత్రిలోనే శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు అధికారులు తీసుకున్న చర్యల ఫలితంగా ఇక్కడ ఆపరేషన్లు కొనసాగుస్తున్నాం. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు వెయ్యి ఆపరేషన్లు పూర్తి చేశాం. జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు సకాలంలో నిర్వహిస్తున్నాం. ప్రతి ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆందోళన చెందకుండా నేరుగా పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేరి నాణ్యమైన మెరుగైన వైద్య చికిత్సలు పొందవచ్చు. – డాక్టర్ శంకర్ ప్రసాద్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి, పాడేరు.

మావోయిస్టులారా.. మా జిల్లాకు రావద్దు

- అల్లూరి ఆదివాసి యువజన సంఘం పేరిట వాల్‌పోస్టర్లు



మావోయిస్టులకు వ్యతిరేకంగా అతికించిన వాల్ పోస్టర్లు

ముంచంగిపుట్టు/చింతపల్లి రూరల్: మావోయిస్టులారా మీరు మా అల్లూరి జిల్లాకు రావద్దు, మా అభివృద్ధిని అడ్డుకోవద్దంటూ ముంచంగిపుట్టు, చింతపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో అల్లూరి ఆదివాసి యువజన సంఘం పేరిట వాల్‌పోస్టర్లు వెలిశాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు మారుమూల కుమడ, బూసిపుట్టు,బాబుసాల, లక్ష్మీపురం,వనుగుమ్మ,రంగబయలు పంచాయతీల్లోని పలు గ్రామాల్లో మావోయిస్టుల చేసిన విధ్వంసాలను వాల్‌పోస్టర్లలో పేర్కొన్నారు. 'మీరు మా జిల్లాలో లేనప్పుడు సంతోషంగా, ప్రశాంతంగా గడుపుతున్నాం. రహదారులు,సెల్ టవర్‌లు నిర్మించుకొంటున్నాం.అభివృద్ధి ఫలాలు అందుకొంటున్నాం. మీరు మా జిల్లాకు రావద్దు' అంటూ వాల్‌పోస్టర్లలో పేర్కొన్నారు. దుకాణాల వద్ద, చెట్లకు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గ్రామాలకు వెళ్లే దారి పొడువునా వీటిని అతికించారు.

న్యూస్‌రీల్

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో లాలం సీతయ్య

చింతపల్లి రూరల్: మండలంలోని గొందిపాకలు సచివాలయానికి చెందిన ముగ్గురు సిబ్బందికి ఎంపీడీవో లాలం సీతయ్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన గురువారం సచివాలయాన్ని సందర్శించారు. విధులకు గైర్హాజరైన వీఆర్వో, వీహెచ్ఏ, మహిళా పోలీసుకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు ఆలస్యంగా హాజరైన ఎడ్యుకేషన్ వెల్‌ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో సారి ఇలా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పెదబరడ గ్రామ సచివాలయాన్ని సందర్శించి బయోమెట్రిక్ హాజరు తనిఖీ చేశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పెదబరడ, గొందిపాకల పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న ఆర్బీకే, సచివాలయ భవనాలను ఆయన పరిశీలించారు. నాణత్యా ప్రమాణాలతో నిర్మించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గొందిపాకలలో నిర్వహించిన సమావేశంలో ఏపీవో కొండబాబు, జూనియర్ అసిస్టెంట్ జాన్ దయానంద్ తదితరుల పాల్గొన్నారు.

పీజీటీ, టీజీటీ అభ్యర్థుల మెరిట్ లిస్టు విడుదల

- నేటి నుంచి చంద్రంపాలెంలో ధ్రువీకరణపత్రాల పరిశీలన

సాక్షి,పాడేరు: ఏపీ మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పీజీటీ, టీజీటీ పోస్టుల నియామకానికి సంబంధించి అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను డీఈవోవీఏ స్‌పీ.నెట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ పోస్టులకు అర్హులైన వారు జాబితాను పరిశీలించుకుని ఈ నెల 23,24 తేదీల్లో విశాఖపట్నంలోని మధురవాడలోని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ వద్దకు ఉదయం 8 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. గతంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కాని అర్హులైన అభ్యర్థుల వివరాలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆమె తెలిపారు.

డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులను నియమించాలి



కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీ గొడ్డేటి మాధవి

సాక్షి,పాడేరు : అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ, చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, సిబ్బందిని నియమించాలని కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కరరావుకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. అమరావతిలో గురువారం కమిషనర్‌ను ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పనతో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బందిని త్వరితగతిన నియమించాలని కోరారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతి గదులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది కొరతను తీర్చాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి, అరకులోయ, చింతపల్లి డిగ్రీ కళాశాలల్లో సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని ఎంపీ మాధవి విలేకరులకు తెలిపారు.

జిల్లాలో 50,656 మందికి వైఎస్సార్ చేయూత



వైఎస్సార్ చేయూత సాయంతో ఏర్పాటు చేసిన కిరాణాదుకాణాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

- నేడు మూడో విడతగా రూ.94.98 కోట్లు విడుదల

సాక్షి,పాడేరు/రాజవొమ్మంగి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం 3వ విడత ఆర్థికసాయం పంపిణీ శుక్రవారం ప్రారంభం కానుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి పాడేరు కలెక్టరేట్‌లో వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వెలుగు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 50,656 మంది అర్హులైన మహిళల ఖాతాలో రూ.94.98కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. 45 నుంచి 60ఏళ్లలోపు మహిళలకు ఒక్కొక్కరికీ రూ.18,750ల ఆర్థిక సాయం అందనుంది. అరకులోయ, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో మధ్యాహ్నం నుంచి ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులపల్లి ధనలక్ష్మిలు కూడా వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

జిల్లాలో లబ్ధిదారుల వివరాలు :

మండలం	లబ్ధిదారులు	నగదు (రూ.లలో)
అనంతగిరి	2,536	4,75,50,000
అరకులోయ	2,865	5,37,18,750
డుంబ్రిగుడ	2,978	5,58,37,500
హుకుంపేట	3,090	5,79,37,500
పాడేరు	2,877	5,39,43,750
జి.మాడుగుల	2,654	4,97,62,500
పెదబయలు	2,338	4,38,37,500
ముంచంగిపుట్టు	2,350	4,40,62,500
చింతపల్లి	3,856	7,23,00,000
జి.కె.వీధి	3,024	5,67,00,000
కొయ్యూరు	3,269	6,12,93,750
రంపచోడవరం	1,693	3,17,43,750
రాజవొమ్మంగి	2,833	5,31,18,750
వై.రామవరం	864	1,62,00,000
మారేడుమిల్లి	605	1,13,43,750
గంగవరం	1,813	3,39,93,750
దేవీపట్నం	1,564	2,93,25,000
అడ్డతీగల	2,090	3,91,87,500
చింతూరు	1,867	3,50,06,250
కూనవరం	1,588	2,97,75,000
ఎటపాక	2,464	4,62,00,000
వీఆర్‌పురం	1,438	2,69,62,500

ఆశ్రమ పాఠశాలల్లో వారానికి ఒకసారి రాత్రి బస

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



హెచ్‌ఎంకు మెడికల్ కిట్ అందజేస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్సు హెచ్‌ఎంలు వారానికి ఒక సారి ఆశ్రమ పాఠశాలల్లో రాత్రి బస చేయాలని సూచించారు. మహిళా అధికారులు బాలికల ఆశ్రమ వసతిగృహాలు, పురుషులు బాలుర వసతిగృహాల్లో రాత్రి బస చేసి, అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించి, నివేదిస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ ఏఎన్‌ఎంలు,మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆశ్రమ పాఠశాలలను నెలకు రెండుసార్లు సందర్శించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం

రెండవ విడత మనబడి నాడు–నేడు పనుల్లో హెచ్‌ఎంలు కీలకంగా వ్యవహరించి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల కమిటీల ఆధ్వర్యంలోనే పనులు చేపట్టాలని తెలిపారు. కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే సంబంధిత హెచ్‌ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దసరా సెలవుల అనంతరం 60 నుంచి 70 మంది విద్యార్థులను శ్రీహరికోటకు విజ్ఞాన యాత్రకు పంపిస్తామని చెప్పారు.

ఆగస్టు నెల వరకు డైట్ బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం హెచ్‌ఎంలకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. మెడికల్ కిట్లలో ఉన్న మందులు మూడు నెలలకు ఉపయోగపడతాయని, విద్యార్థులకు సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ ఉపసంచాలకుడు ఐ.కొండలరావు, 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఐటీడీఏ పీవో



కేంద్ర మంత్రి రేణుక సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

అరకులోయ రూరల్: కేంద్ర గిరిజన సంక్షేమ సహాయ మంత్రి రేణుక సింగ్‌ను పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక ఏపీ టూరిజం రిసార్ట్ హరితలో గురువారం నిర్వహించిన జాతీయ గిరిజన ఉత్సవ్‌లో పాల్గొనేందుకు మంత్రి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

గిరిజన ఉద్యోగ సంఘం నాయకుల వినతి

గిరిజన ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలపై గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతరులు కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు. 5వ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు ఉన్న హక్కులను పటిష్టంగా అమలు చేయాలని, అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని, నకిలీ గిరిజనులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గిరిజన ఉద్యోగులు సంఘం నాయకులు మండి నాగేశ్వరరావు,పాంగి నందో తదితరులున్నారు.

జల్ జీవన్ మిషన్‌తో తాగునీటి సమస్య పరిష్కారం

- పాడేరు డివిజన్ కో ఆర్డినేటర్ బారికి మాణిక్యం



మాట్లాడుతున్న జల్ జీవన్ మిషన్ పాడేరు డివిజన్ కో ఆర్డినేటర్ మాణిక్యం

పాడేరు రూరల్: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో రక్షిత నీరు సరఫరా చేస్తామని జల్‌జీవన్ మిషన్ పాడేరు డివిజన్ కో ఆర్డినేటర్ బారికి మాణిక్యం తెలిపారు. మండలంలోని గుత్తులపుట్టు గ్రామ సచివాలయంలో గురువారం గబ్బంగి, జి.ముంచంగిపుట్టు, గుత్తులపుట్టు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో తాగునీటి సరఫరా పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తులపుట్టు సర్పంచ్ సాగెని బాబూరావు పడాల్, జల్‌జీవన్ మిషన్ పాడేరు, జి.మాడుగుల మండలాల కో ఆర్డినేటర్లు కూడా శ్రీనుబాబు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బోండా గిరిజనులకు దుస్తుల పంపిణీ



దుస్తులతో బోండా గిరిజన మహిళలు

- నాలుగు గంటలు ప్రయాణించి వెళ్లిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన బోండా గిరిజన గ్రామాల్లో గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పర్యటించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశాలతో వారు సుమారు నాలుగు గంటలు ప్రయాణించి, తీవ్రమైన శ్రమకోర్చి బోండా గిరిజన గ్రామాలను చేరుకున్నారు. హోంద్రాల్,ఒనకఢిల్లీ గ్రామాల్లో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ గంగరాజు ఆధ్వర్యంలో రెండు వందల మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఒనకఢిల్లీ వారపు సంతను సొసైటీ ప్రతినిధులు సందర్శించి, బోండా జాతి గిరిజనుల అలవాట్లు, సంప్రదాయాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ బోండా గిరిజన గ్రామాలకు వెళ్లి దుస్తులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని, సొసైటీ రాష్ట్ర చైర్మన్ శ్రీధర్‌రెడ్డి దుస్తులను వితరణ చేశారని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, కోశాధికారి టి.అప్పారావు, ఒనకఢిల్లీ ప్రతినిధులు సుధాకర్, బికాస్ సత్‌పతి, పొడు మఖోరో, లైఫ్ మెంబర్స్ లోహితాస్, జయలక్ష్మి, సింహాచలం, జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బోండా మహిళకు దుస్తులను అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ముగిసిన ఎంపిక



ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

అరకులోయ : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎంపిక ప్రక్రియ గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. 5వ తరగతికి 37 మంది, 6వ తరగతికి 15 మంది, 8వ తరగతిలో ప్రవేశానికి ఎనిమిది మంది విద్యార్థులు పలు జిల్లాల నుంచి దరఖాస్తు చేసుకోగా వారందరికీ క్రీడలు, వ్యాయామంలో ప్రతిభను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్య అభ్యసించి, మంచి హోదాల్లో స్థిరపడాలని కోరారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులకు సమస్యలుంటే తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రిన్సిపల్ దైవకృప, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

డుంబ్రిగుడ: అరమ, తూటంగి పంచాయతీల్లో హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు గురువారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రహదారుల సమస్యలను స్థానికులు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలను ఎమ్మెల్యే పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానన్నారు. సర్పంచ్‌లు శాంతి, లక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, ప్రేమానందం, నాగేశ్వరరావు, విశ్వనాథం, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్‌లు అందజేస్తున్న సీడీపీవో లక్ష్మీదేవి

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని గురువారం జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందించిన స్మార్ట్‌ఫోన్‌లను సీడీపీవో లక్ష్మీదేవి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని, పౌష్టికాహార పంపిణీ, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సుమారు 250 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్‌లు అందజేసినట్టు చెప్పారు. సూపర్‌వైజర్ వలసమ్మ, లక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణానికి శంకుస్థాపన



టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సన్యాసిరావు తదితరులు

అనంతగిరి: వాలసీ పంచాయతీ నిమ్మలపాడులోని జియోటవర్‌కు పనులకు సర్పంచ్ సన్యాసిరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సెల్ సిగ్నల్స్ లేక ఇబ్బంది పడేవారమని, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ చొరవతో టవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. గోపాలకృష్ణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణ యాప్‌లపై అప్రమత్తం



వలసంపేటలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామినాయుడు, సిబ్బంది

కొయ్యూరు: కినపర్తి పంచాయతీ వలసంపేటలో సీఐ స్వామినాయుడు గురువారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రుణ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. యాప్‌ల లింక్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని, వ్యక్తిగత, బ్యాంకు సమాచారాన్ని తెలియజేయవద్దని సూచించారు. గంజాయి, సారాకు దూరంగా ఉండాలన్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, ఇతరత్రా పత్రాలు ఉంచుకొని ప్రయాణాలు సాగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

మహా నిర్లక్ష్యం

- నిరుపయోగంగా జూనియర్ కళాశాల వసతి గృహం భవనం
- వృథాగా విలువైన యంత్ర సామగ్రి



అడ్డతీగలలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతిగృహం భవనం

అడ్డతీగల: అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవనం.. నిరుపయోగంగా మారింది... ఏళ్లు గడుస్తున్నా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు.. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన వసతి గృహం భవనం తొమ్మిదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఐటీడీఏ రూ.92 లక్షల వ్యయంతో నిర్మించిన వసతి గృహాన్ని 2013లో ప్రారంభించారు. అయితే నాటి నుంచి వినియోగంలోకి తీసుకురాలేదు. భవనంలో బోరు వేయించి మంచినీటి సదుపాయం కల్పించారు. డైనింగ్ హాలుతో పాటు తొమ్మిది గదులు నిర్మించారు. మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచారు. కళాశాల భవనాలకు చేరువలోనే ఈ భవనాన్ని కూడా నిర్మించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ భవనం వినియోగంలోకి రాలేదు.

అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా...

ప్రస్తుతం ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. నిత్యం మందుబాబులు విడిది క్షేత్రంగా ఈ భవనాన్ని మార్చుకొని వాడుకొంటున్నారని, విద్యుత్ వైరింగ్ సామగ్రి కూడా చాలా వరకూ చోరీకి గురైనట్టు చెబుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే దూరప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం అవసరాలను గుర్తించి ఐటీడీఏ అధికారులు వసతిగృహానికి భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే అధికారుల బదిలీల తరువాత నిర్ణయాలు మారతాయన్నట్టు కళాశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులలో బాల, బాలికలకు వేర్వేరుగా మరో రెండుచోట్ల వసతిగృహం సౌకర్యం కల్పించి ఈ భవనాన్ని మాత్రం వినియోగానికి చర్యలు తీసుకోలేదు. బాలికలకు ఆశ్రమ ఉన్నత పాఠశాల కాంపౌండులోనూ, బాలురకు మరో వసతిగృహంలో వసతి కల్పించి ఏటా అదే పద్ధతిని పాటిస్తున్నారు. లక్షలాది రూపాయలతో అన్ని హంగులతో నిర్మించిన ఈ భవనం నేటికి వినియోగంలోకి రాకపోవడంపై పలువురు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అన్ని హంగులతో సమకూరిన ఈ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయానికి గాని, పాఠశాలకు గాని కేటాయించాలని స్థానికులు చెబుతున్నారు. లేకుంటే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగానే ఈ భవనం ఉండిపోతుందంటున్నారు.



రంపచోడవరం స్త్రీశక్తి భవన సముదాయం వద్ద ఆరుబయట వృథాగా ఉన్న విలువైన సామగ్రి

ఆరుబయట వృథాగా ప్రభుత్వ ఆస్తి

రాజవొమ్మంగి: స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద విలువైన యంత్ర సామగ్రి తుప్పు పట్టిపోతోంది. వీటిలో ప్లాస్టిక్ వ్యర్థాలుక్రషింగ్ మిషన్ ఒకటి, మరొకటి రైతు కియోస్క్ యంత్రం.. లక్షలాది రూపాయల విలువ చేసే ఈ యంత్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. టచ్ స్క్రీన్, ఇతరత్రా విలువైన సామగ్రి తుప్పుపట్టి పాడైపోతోంది. ప్లాస్టిక్ వ్యర్థాల క్రషింగ్ మిషన్‌కు సంబంధించిన రెండు మోటార్లు కూడా ఎండకు ఎండి, వర్షానికి తడుస్తున్నాయి. పూర్తిగా పాడైపోతున్నాయి. స్థానిక వెలుగు కార్యాలయంలో మూడేళ్లకు పైగా ఉన్న ఈ యంత్రాల వినియోగంపై అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం వృథాగా మారిపోయిందని స్థానికులు చెబుతున్నారు.

'గడప గడప'తో ప్రజా సమస్యల పరిష్కారం



గ్రామస్తులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు, సామాజిక సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యతనిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీలోని వెంకయ్యపాలెం, ఓరక ఒడ్డు, దాసరితోట గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో147 గడపలను సందర్శించి, సంక్షేమ పథకాల అమలును, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని పథకాలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిచేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలియజేయాలని కోరారు. పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్‌లు ఎం.అప్పారావు, పి.అప్పారావు, సీతయ్య, ఎంపీటీసీలు మితుల, తొటినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనంద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు మదీనా, మాజీ సర్పంచ్ స్వామి, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు, కార్యదర్శి వరలక్ష్మి, వీఆర్వో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట



దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట ప్రతిష్ఠిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు

జి.మాడుగుల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో దసరా ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం భక్తిశ్రద్ధలతో ముహూర్తపు రాటను ప్రతిష్ఠించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, స్వామినాయుడు, సత్తిబాబు, గుప్త తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో ఈనెల 26 నుంచి 5వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పవనగిరి వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కనకదుర్గ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, విశేష పూజా కార్యక్రమాలు చేస్తామన్నారు. విజయదశమి రోజున షిర్డీ సాయినాథునికి అభిషేకం, అష్టోత్తర పూజ అలంకరణ చేపడుతున్నట్టు తెలిపారు. ఉత్సవాల ముగింపు రోజున అమ్మవారికి అర్పించిన కుంకుమ, అక్షింతలను వితరణ గావిస్తామన్నారు.

మనోవికాసంపై అవగాహన



జయహో మహిళా కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థినులు

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ×జయహో మహిళా । కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చైల్డ్ వెల్ఫేర్ మాజీ చైర్‌పర్సన్, న్యాయవాది బి.పద్మావతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమెన్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ నేర్ల జయశ్రీ అధ్యక్షత వహించగా, లయన్స్ క్లబ్ సభ్యులు వసంతకుమారి, సుజాత, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బాలికల మనోవికాసం, వైద్య, న్యాయపరమైన సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఝాన్సీహేన్సన్, పీడీ నాగమణి, పీఈటీ పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచ్ శారద

డుంబ్రిగుడ: సంతబయలు, బిట్రగండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సందర్శించి, చిన్నారులకు నులిపురుగు నివారణ మందును జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచ్ శారద అందజేశారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నులిపురుగు నివారణ మందును చిన్నారులకు వేయించాలని సూచించారు. ఆహారం తీసుకునే ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని చిన్నారులకు సూచించారు. ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, సీడీపీవో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ



నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు



పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

రంపచోడవరం: ఇమ్మిడివరం, గోగుమిల్లి, పందిరిమామిడి, చిన్నబీరంపల్లి పాఠశాలల్లో నాడు-నేడు పనులకు ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పిటీసీ పండా వెంకటలక్ష్మి తదితరులు గురువారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారని, ఇందుకోసం నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరిందని స్పష్టం చేశారు. నాడు-నేడు పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. పనులను పాఠశాల కమిటీ పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం పందిరిమామిడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైస్ ఎంపీపీలు బాలకృష్ణ, కుమారి, ఎంపీటీసీ సభ్యులు మంగయమ్మ, సాయిబాబా, వంశీ , సర్పంచ్‌లు విజయశాంతి,స్వామిదొర, ఆలయ చైర్మన్ శేఖర్, నాయకులు రామకృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వై.రామవరం: పెద్దఊలెంపాడు, కె.ఎర్రగొండ ఎంపీపీ పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు పనులను ఎంపీపీ కడబాల ఆనందరావు తదితరులు గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కనకరాజు తదితరులున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



జీసీసీ వైస్ చైర్మన్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెట్రోల్ బంకు సిబ్బంది

గూడెంకొత్తవీధి: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జీసీసీ పెట్రోల్ బంకు సిబ్బంది (గన్‌మెన్‌లు) జీసీసీ వైస్ చైర్మన్, ఎండీ సురేష్‌కుమార్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఏజెన్సీలోని 11 మండలాల్లో జీసీపీ పెట్రోల్ బంకుల్లో 2016 నుంచి విధులు నిర్వహిస్తున్నామని, పీఎఫ్, ఈఎస్ఐ అమలుతో పాటు వేతనం పెంచాలని విన్నవించారు.

వేగవంతంగా సెల్ టవర్ పనులు



శరభన్నపాలెం రహదారిలో చేపట్టిన కేబుల్ పనులు

కొయ్యూరు: గిరిజనులకు మొబైల్ సేవలు అందించే ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా ఎయిర్‌టెల్ సెల్‌టవర్ ఏర్పాటులో భాగంగా ప్రస్తుతం అండర్ గ్రౌండ్ కేబులు పనులు చేపడుతున్నారు. అనకాపల్లి జిల్లా కృష్ణాదేవిపేట నుంచి శరభన్నపాలెం వరకు ఎయిర్‌టెల్ కేబుల్ వేస్తున్నారు. ఇది పూర్తికాగానే టవర్‌ను ఏర్పాటు చేసి సేవలందించనున్నారు. పెదమాకవరం, శరభన్నపాలెంలో రెండు టవర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేబుల్‌ను చింతపల్లి వరకు వేయనున్నారు. దీంతో ఈ ప్రాంతంలో సెల్ సిగ్నల్ సమస్య పరిష్కారమవుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా పెట్రోల్ బంకు నిర్మాణ పనులు



లుంగాపుట్టు వద్ద జరుగుతున్న పెట్రోల్ బంకు పనులు.

ముంచంగిపుట్టు: మండలంలో గల వనభసింగి పంచాయతీ లుంగాపుట్టు గ్రామ సమీపంలో ట్రైబల్ వేల్ఫర్ నిధులు 80లక్షల రూపాయలతో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.మండలంలో ఇప్పటి వరకు పెట్రోల్ బంకు లేకపోవడంతో వాహనదారులు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదబయలు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. పెట్రోల్ బంకు దూరం కావడంతో నిత్యం వాహనదారులు పెట్రోల్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో పెట్రోల్ బంకు మంజూరైన స్థల సమస్యతో కాలయాపన జరిగి, చివరకు రద్దుయిపోయింది. మండల వాసుల పెట్రోల్ బంకు కష్టాలను గమనించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు ప్రత్యేక చొరవ తీసుకొని, హెచ్‌పీసీఎల్ అధికారులతో మాట్లాడి పెట్రోల్ బంకును మంజూరు చేయించారు. బంకు నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. నెల రోజుల్లో బంకు అందుబాటులోకి రానున్నట్టు అధికారులు తెలిపారు. పెట్రోల్ బంకు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే కష్టాలు తీరుతాయని వాహనచోదకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోపణలు తగవు

అడ్డతీగల/మారేడుమిల్లి: ఇటీవల సంఘాల పేరుతో కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం వాల్మీకి తెగపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అల్లూరి జిల్లా వాల్మీకి సంఘం ప్రతినిధులు నారాయణరావు, చిన్నిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వాల్మీకి సంఘం సమావేశాన్ని అడ్డతీగలలో నిర్వహించుకుని పలు సమస్యలు చర్చించామన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342(1) ప్రకారం వాల్మీకి తెగను షెడ్యూల్డ్ తెగగా 1956లో గుర్తించి రాజపత్రం విడుదల చేసిందన్నారు. అటవీ ప్రాంతాల్లో సహచర గిరిజనులతో కలిసి జీవిస్తున్నామని పేర్కొన్నారు. అయితేకొంతమంది సంఘాల పేరిట స్వప్రయోజనాలు, స్వార్థ రాజకీయ లబ్ధికోసం మైనార్టీ తెగ అయిన వాల్మీకి తెగ మీద నిరాధారమైన ఆరోపణలతో ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గిరిజన తెగల పెద్దలంతా చర్చించి సమస్య పరిష్కారానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. వాల్మీకి తెగపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు

టీడీపీ నాయకుల తీరుపై ధ్వజం



ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర

జి.మాడుగుల: టీడీపీ నాయకులు ప్రజల మీద ప్రేమే ఉంటే రోజూ అన్న క్యాంటీన్ నిర్వహించి సేవలందించాలని లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర సవాల్ విసిరారు. ఆయన స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడుతూ జి.మాడుగులలో టీడీపీ నాయకులు ఒక్క రోజు అన్న క్యాంటీన్ నిర్వహించి, రోజు నిర్వహిస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారన్నారు. పేదలకు ఒక పూట భోజనం పెట్టి చేతులు దులుపుకుంటున్న టీడీపీ నాయకుల తీరు దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారన్నారు. ఇందులో టీడీపీ నాయకులు కూడా లబ్ధిపొందుతున్నారని, ఇది మీకు తెలియదా? పథకాలు పొంది కూడా ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు అబద్ధపు హామీలు ఇవ్వడం తప్పా, ప్రజలకు మంచి చేసిన దాఖలాలు లేవని, ఇది ప్రజలకు తెలుసునన్నారు. ఇకపై ప్రభుత్వం, ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

26న ఆదివాసీ మహాసభ



సమావేశమైన ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం సభ్యులు

వై.రామవరం: రంపచోడవరం పి.ఎం.ఆర్ సీ ఆవరణలో ఈనెల 26న నిర్వహిస్తున్న ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవ మహాసభను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షులు వెదుళ్ల లచ్చిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా వై.రామవరంలో సంఘ మండల కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘం మొదటి వార్షికోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభలో గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణపై చర్చించనున్నట్టు తెలిపారు. మహా సభకు అదివాసీ ఉద్యోగులు, పెద్దలు అన్ని వర్గాల వారు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వై.రామవరం మండలంలోని సమస్యలు, వార్షికోత్సవ వేడుకలు నిర్వహణకు కమిటీ పెద్దలతో చర్చించారు. ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు పండు, రామలింగం, శివయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో గడప గడపకు..

జి.మాడుగుల: జి.మాడుగుల గ్రామ సచివాలయం-2 పరిధిలోని కరకపల్లి, మూలగరువు, దర్లంగొంది, దొబ్బులోవ గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర, యూత్ అధ్యక్షుడు కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విచ్చేస్తారని పార్టీ శ్రేణులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

చింతపల్లి: విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని ఈపీడీసీఎల్ (విశాఖపట్నం) అకౌంటెంట్ రాము గణేష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం డీ-లిస్టు వినియోగదారుల గృహాలు, దుకాణ సముదాయాలు ఆయన తనిఖీ చేశారు. మండల కేంద్రంలో 150 మంది విద్యుత్ వినియోగదారులు బిల్లులు సకాలంలో చెల్లించడం లేనట్టు గుర్తించామన్నారు. బిల్లులు చెల్లించని వినియోగదారుల కనెక్షన్లు తొలగిస్తామన్నారు. ఏఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజవొమ్మంగి/మారేడుమిల్లి: విద్యుత్ లైన్‌లకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు రంపచోడవరం విద్యుత్ శాఖ ఈఈ ఎండీ యూసుఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజవొమ్మంగి, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం , అడ్డతీగల మండలాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మిడ్డే మీల్స్ అమలుచేయాలి

గూడెంకొత్తవీధి: మొండిగెడ్డ గ్రామంలో ఎంపీపీ పాఠశాలను ఉప సర్పంచ్ జి.సత్యనారాయణ గురువారం సందర్శించారు. పాఠశాలలో నాలుగు రోజులుగా మధ్యాహ్నం భోజనం పథకం అమలు కావడం లేదని, విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాల్సి వస్తోందని, పూర్తిస్థాయిలో సరకులు ఉన్నా నిర్వాహకులు వండిపెట్టడం లేదన్నారు. దీనిపై ఎంఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి రాలేదని, పూర్తిస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిజనుడికి న్యాయం చేయాలి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని గిరిజనుడికి చెందిన దుకాణాన్ని గిరిజనేతరుడికి కేటాయింపుపై అఖిలపక్ష నేతలు గురువారం ఆందోళన చేశారు. గిరిజనుడికి న్యాయం చేయాలని ఏడాదిగా కోరుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా గిరిజనేతరుడి షాపు అప్పగించే ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. ఉత్తర్వులు రద్దు చేయాలని, భూబదలాయింపు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని నేతలు శ్రీను, భీమరాజు, గాసిరావు డిమాండ్ చేశారు. అయితే ఉత్తర్వులు పాటించాలని తహసీల్దార్ తెలియజేయడంతో నాయకులు పాడేరు వెళ్లి ఐటీడీఏ పీవో గోపాలకృష్ణను కలిసి సమస్యను వివరించారు. దీంతో తాత్కాలికంగా షాప్ తెరిచే ఉత్తర్వులు నిలుపుదల చేయాలని తహసీల్దార్ నర్సమ్మను ఫోన్‌లో ఆదేశించారు. ఇరు వర్గాలతో చర్చించి తీర్పు ఇస్తామని నేతలకు తెలియజేశారు.

ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు

అరకులోయ రూరల్: ఏకలవ్య పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు సురేంద్ర అన్నారు. పాఠశాల, కళాశాలల్లో పోస్టుల భర్తీ కోసం జీవో నంబర్-3ని అమలుచేయాలన్నారు. రామారావు తదితరులున్నారు.

విద్యార్థుల ధర్నా

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం పాడేరు ఐటీడీఏ ఎదుట బైటాయించి ధర్నా కార్యక్రమం చేపట్టారు. పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించాలని, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పాడేరు ఎస్ఐ లక్ష్మణరావు,ఇతర సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ స్పందించి, విద్యార్థులతో మాట్లాడి అయా సమస్యలు పరిష్కారానికి హామీ ఇచ్చారు.

26 నుంచి గడప గడపకు..

చింతపల్లి రూరల్: పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వారి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ పాల్గొవాలని ఎంపీడీఓ లాలం సీతయ్య గురువారం తెలిపారు. ఈ నెల 26 మధ్యాహ్నం 2 గంటలకు కొమ్మంగి గ్రామ సచివాలయం పరిధిలో కొలపరి, మూలగరువు, రొరింతాడ, గేంజిగెడ్డ, సల్లాయి గ్రామాల్లో 27 న కొమ్మంగి, ఉరిసింగి, ముల్లుమెట్ట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.మండల స్థాయి అధికారులు శాఖల యొక్క పూర్తి సమాచారంతో హాజరుకావలని ఆయన కోరారు.

తాగునీరు వృథా



డుంబ్రిగుడ: మండల కేంద్రంలో తాగునీరు అందించేందుకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో కుళాయిలు ఏర్పాటు చేసినా ట్యాప్ బిగించకపోవడంతో తాగునీరు వృథాగా పోతుందని స్థానికులు చెబుతున్నారు. అరకు-పాడేరు ప్రధాన రోడ్డు పెట్రోల్‌బంక్ పైపులైన్ పాడై నీరు వృథాగా పోతోందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.